మట్టోళ్లపల్లెకు భారతం ఆడడానికి వెళ్ళిన ద్వారకుడు మధ్యలోనే పనుండి ఊర్లోకి దిగాడు. యింటికి వెళ్ళి స్నానం చేసి, భోంచేసుకుని నిదానంగా రంగప్పింటికి బయలు దేరాడు. అతనితోనే పని.

పెచ్చులూడిపోయిన మట్టిగోడలతో, జారి పోయిన పైకప్పుతో నిరాదరణకు గురైన అనాథ పిల్లవాడిలా కనిపిస్తోంది రంగప్ప గుడిసె. దాని ప్రక్కనే శిథిలావస్థలో ఉన్న గొడ్ల కొట్టం కూలడానికి సిద్ధంగా ఉన్నట్లుంది.

"ఏం మామా. ఏం జేస్తావుండావు?" అంటూ గుడిసెలోకి అడుగు పెట్టాడు ద్వారకుడు.

నట్టింటి గోడకానుకుని చతికిలపడి ఉన్న రంగప్ప అతన్ని చూడగానే 'రా.. రా' అంటూ ఆహ్వానించాడు.

చొక్కాలేని బక్కశరీరం. మొలకు చిరుగులు పడి కనిపిస్తున్న అడ్డపంచె... నిరంతరం జీవిత పోరాటం చేస్తున్న రైతులకు ప్రతీకలా కనిపిస్తున్నాడు రంగప్ప.

ద్వారకుణ్ణి చూసి పొయ్యి మీదున్న సంగటిని కట్టెతో కెలుకుతూ "రా అల్లుడా... రా..." అంటూ ఆప్యాయంగా పలుకరించింది వెంకటమ్మ.

పొయ్యి పైన ఉమ్మటిల్లిన సంగటి సమ్మగా ముక్కుపుటాలను సోకుతోంది.

"ఏమత్తా. సంగటి జేస్తావుండావా? సినపాపయేదీ?" అని రంగప్ప పక్కగా వెళ్ళి కూర్చున్నాడు ద్వారకుడు.

"ఏంజెనేదిరా... వయసు బిడ్డె. పెండ్లి కావాల్సిన పిల్ల... రోడ్డు పని చేయిస్తా ఉండారంటే అందరితో బాటు కూలికి బోయింది" చెప్పింది వెంకటమ్మ.

"యాడా సంబంధాలు సూడలేదా?"

"ఏం సంబంధాలు నాయనా.... ఈ కరువు కాలానికి పెండ్లిండ్లు జేసేటిగా ఉందా. తిండికే జరగలా..." అని ఒక్కసారి నిట్టూర్చి, సంగటి కట్టెను కడిగి అడ్డుగోడకు ఆనించి, చేయి కడుక్కుని పెరట్లోకి వెళ్ళింది.

ద్వారకుడు రంగప్ప వైపు చూశాడు. రంగప్ప మౌనంగా ఏదో ఆలోచిస్తూ మౌనిలా కూర్చోనున్నాడు.

సొసైటీ వాళ్ళు రంగప్ప ఇంటిని జప్తు చేసిన విషయం ఊర్లోకి రాగానే తెలుసుకున్నాడతను. ఆ విషయం కదిపితే ఎక్కడ బాధపడతాడోనని రెండు క్షణాలు మౌనంగా కూర్చుని ఇల్లంతా చూశాడు. ఇంట్లో ఏ వస్తువులూ లేవు.చివరికి బిందెలు కూడా లేవు. ఎవరో దోచేసినట్లు బోసిగా కనిపించింది. ఇక ఆగలేక పోయాడు ద్వారకుడు.

"ఏం మామా. సొసైటీవోళ్ళు మీ ఇల్లు కూడా జప్తుచేసినారంటనే."

"అవును" అనలేక అన్నాడు.

"సొసైటీలో మీకూ అప్పుండాదని నాకు తెలీదు మామా"

"ఈ ఊర్లో అప్పులేందెవురికిరా... అందరికీ ఉండాది"

"సొసైటీలో నువ్వెందుకప్పు తీసుకుంటివి?"

"కీనీరు మాదిరుండే మా కపిలబాయి ఎండిపోయి శ్యానా యేండ్లయిపాయ కదా. అందురూ వోళ్ళోళ్ళ బావుల్లో బోరింగులు యేయించబట్రి గదా. అది జూసి నేనూ మా బాయిలో బోరింగేయిద్దామని డెబ్బయి వేలు అప్పు సొసైటీలో దెచ్చి బోరేయిస్తి. అయిందొందలడుగులు దిగినా నీళ్ళు సుక్క రాలా. అప్పు మాత్రం మిగిలిపాయ. ఇంక అప్పట్నుంచీ వానలూ బడలా సేద్యాలూ సాగలా, ఆ అప్పు అప్పుగానే ఉండిపాయ. తిండికే జరగలే. యాడదెచ్చి కట్టేది. కడాకు ఇండ్లు జప్తు జేసి ఇంట్లో ఉండేటివన్నీ దోచకపోయిరి." నొప్పిగా చెప్పాడు రంగప్ప.

ద్వారకుడు మౌనంగా తలవంచుకున్నాడు. "ఏమిరా. మీరాడతా ఉండే భారతం అయిపాయనా" తిరిగి అడిగాడు రంగప్ప.

"లేదు మామా. వారమే గదా అయింది" అన్నాడు ద్వారకుడు.

"పగలు కథ ఎవురు చెప్తావుండారు?"

"తిరపతి నించీ వొగ ఆడామెను పిల్చినారు. పరవాలేదు. బాగానే సెప్తాది. కానీ హరికధలో నీల్మాపాటలు ఎక్కువ పాడతాది" అన్నాడు.

"పాడాల్సిందే.ఈ సిన్మాలు, టీవీలు వచ్చేసిం తర్వాత వట్టి పురాణకత ఎవురింటారు. సరే మద్దెలో నువ్వేమీ వచ్చేసినావే."

"అక్కడికి పాయినా శ్యానా మందికి జొరాలు పట్టుకుండె. అవి ఏమి జొరాలో ఏమొ గానీ పట్టుకుంటే వదలడంలే, జొరం తగ్గక మొన్ననే ఇద్దరు తిరుక్కొనొచ్చేసిరి."

"అవునబ్బా దేశం మింద యాడజూసినా జొరాలుగానే ఉండాయి. పల్లెలో గూడా శ్యానా మందికి జొరాలేలే. సరే మీ భారతంలో కిరాతార్జునీయం అయిపోయిందా?" అడిగాడు రంగప్ప.

"అదెట్టయిపోతాది. ఈ రోజు రేత్తిరికి వారణావతం ఆడతారు."

"మీ ట్రూపులో తవుసుమానెక్కేది సిద్దుగోడే గదా....?" ప్రశ్నించాడు రంగప్ప.

"వాడే మామా. అంత గుండె ధైర్నం గలిగినోడు ఇంకెవుడుండాడు?" అన్నాడు ద్వారకుడు.

"ఎంతన్నా ముసిలోన్నైపోతిననుకో... మీ గురువు మునివెంకటప్ప నన్ను మీ ట్రూపులోకి చేర్చుకోకపాయ... నేను తవుసుమాను ఎక్కేసత్తా వున్నన్ని దినాలూ బాగా వాడుకొని ఇప్పుడు కూరలో కరేపాకు మాదిరి యేరేసిరి... యేసికం యేసుకోని స్టేజిమిందనే పాణాలొదలాలంటా కలలుగంటా వుంటి. ఏం చేద్దాం. ఈ అక్నేకారి కాలం రాబట్టి నాటకాలకు ఆదరణ లేకుండా అయిపాయ. ఏదో శ్యానాదినాలకు భారతమాడే అవకాశమొచ్చిందికదా... వొగ సిన్న యాసమియ్యవయ్యా అంటే మీ గురువు యినకపాయ. నన్నూ ట్రూపులోకి తీసుకోనుంటే అంత బత్తేనికన్నా దుడ్డు కండ్ల జూసింది కదా!" యాస్టపోయాడు రంగప్ప.

"ఇప్పటికీ ఏమీ మించిపోలేదు మామా... నిన్ను ట్రూపులోకి తీసకపోయే దానికే నేనొచ్చింది" చెప్పాడు ద్వారకుడు.

ఆ మాట వినగానే అంత బాధలోను ఆనందంతో రంగప్ప మనసు ఒక్క క్షణం ఊగిపోయింది.

"ఏమిరా బామ్మర్ది. నాతో ఏమీ జారాట్లాడడం లేదుగదా" అన్నాడు.

"అయ్యో సత్తెపమాణకంగా నిజ్జమే సెప్తావుండా మామా. మునెంగటప్ప నిన్ను ఉన్న పలాన తీసక రమ్మన్నాడు" నెత్తిమీద అరచేయి పెట్టుకొని మరీ చెప్పాడు ద్వారకుడు.

"ఇప్పుడు నాతో ఏం పనంట?" గతంలో భంగపడిన వైనం గుర్తొచ్చి బుంగమూతి పెట్టుకుని అన్నాడు రంగప్ప.

"ఏం లేదు మామా... మా ట్రూపులో యిప్పుడు తవుసుమానెక్కే వోళ్ళేలేరు..."

"సిద్దుగోడుండుగదా" అశ్చర్యంగా అడిగాడు.

"నిన్నటిదాకా ఉన్నాడు. ఈ దినమే లేడు."

"ఎందుకు లేడు?"

"ఏం జెప్పేది మామా. కడుపు చించుకుంటే కాళ్ళపైన పడతాది. మొన్న మనపక్కూరులో మూలింటోళ్ళ ముసిలాయన సచ్చిపోయినప్పుడు దినాలనాడు సావునాటకంగా "నలదమయంతి' నాటకం యేస్తిమి గదా... ఆ నాటంలో రెండో నలుడిగా సిద్దుగోడే యాసం గట్టె. ఆ దినం నుంచీ ఆ వూర్లో భీమసెట్టోళ్ళ ఆడబిడ్డకు వోడికీ యెట్లో జత కుదిరిపోయిందంట. మొన్న పెట్టేబేడా సర్దుకొని మట్లోల్ల పల్లెకొచ్చేసిండాదాయమ్మి. వీళ్ళు ముందే ఆ ఏర్పాటు చేసుకున్నిట్టుండాదిలే. సెప్పాపెట్టకుండా అయమ్మిందీసుకోని పత్తాలేకుండా పోయినాడు ముండాకొడుకు. ఈ సంగతి తెలీక ఆ ఊరోళ్ళు గూడా అయమ్మిని తారాడుకుంటా తిరపతికల్లా పోయినారంట." అసలు విషయం చెప్పాడు ద్వారకుడు.

"ఆటోళ్ళకు మంచి నడవర్తి ఉండాల. లేకుంటే ట్రూపుకే గాదు, పల్లెకే చెడ్డపేరొస్తాది. నాటకాలేసి కడుపులకింత మింగతా వుండేమనకు అట్లాంటివి లాకీ కాదు" అన్నాడు రంగప్ప.

"యెగడ్తం ముండాకొడుకు. ఆ ఇంగితం ఉన్నింటే అట్లజేసునా" అన్నాడు ద్వారకుడు.

"సరే. ఇప్పుడు తవుసుమానెక్కేదెవురు?" ఆసక్తిగా ప్రశ్నించాడు రంగప్ప.

"అందుకే గురువు నిన్ను పిల్చకరమ్మన్నాడు."

ఆలోచనల్లో పడిపోయాడు రంగప్ప.

"ఇంకెవరూ ఎక్కలేమంటావుండారు మామా. నువ్వు రావాల్సిందే. నువ్వెంతడిగితే అంతిస్తాడు. ఆ భారతమైపోయే అన్ని రోజులూ నువ్వు యాసం గట్టొచ్చు"ప్రాధేయపడ్డాడు ద్వారకుడు.

"ఎంత్తిస్తాడంట!"

"వొగదినానికి మేటి ఆటగానికి ఎంతిస్తారో అంతకురెండింతలిప్పిస్తా మామా."

మళ్లీ ఆలోచనల్లో పడిపోయాడు రంగప్ప.

"ఏదో రెండు మూడు వేలొస్తే... వొగ సంవత్సరం బత్తేనికి కరువుండదు. ఒంటి ఆడబిడ్డె. కూలికి నాలికీ బోతా పోరకలాడతా ఉండాది. ఆయమ్మకు మంచి సీర కొనిపెట్టొచ్చు. పెండ్లి సంబంధాలు గూడా సూడొచ్చు... సొసైటీలో లోను కొంతయినా తీర్చొచ్చు.... లోను కత ఎట్లున్నా.... కొన్ని చేబదుళ్ళు అయినా తీరతాయి గదా." మనసులోనే అనుకున్నాడు.

"యేసికమైతే యొయ్యొచ్చు. ఉడిగినేళ, అంతెత్తు తవుసు మానిప్పుడు ఎక్కగలనా" ఆలోచిస్తూనే అనుమానం వ్యక్తం చేశ డ

"ఎక్కగలవులే మామా. ఎట్టయినా సిద్దుగోడు పోగొట్టిన మనూరి పరువు ఇంకా నీళ్ళకంటే పల్చన కాకూడదు. నువ్వే ఆదుకోవాల. ఇవి చేతులు కావనుకో" చేతులు పట్టుకున్నాడు ద్వారకుడు

కాదనలేక పోయాడు రంగప్ప. దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచి చివరికి సరేనన్నాడు. అంతా విన్న వెంకటమ్మ కూడా అంగీకారం తెలిపింది.

ఆ రోజు మధ్యాహ్నమే గుడ్డాగుసురు సుర్దుకోని ద్వారకుని వెంట పీలేరు బస్సెక్కేశాడు. యిద్దరూ పీలేరు కొచ్చి, తిరుపతి బస్సెక్కి మట్లోళ్ళపల్లె స్టాపింగ్ దగ్గర దిగినారు. అక్కణ్ణుంచి రెండు కిలోమీటర్లు నడవాలి ఊరికి. చాలా ఏళ్ళ తర్వాత తిరిగి అక్కడ దిగినందుకు సంతోషపడిపోతూ చుట్టూ చూశాడు రంగప్ప. రోడ్డుకు ఉత్తరానున్న కొండ చివర బాల వెంకటేశ్వర స్వామి గుడిశిఖరం పై నుంచీ పావురాలు ఎగురుకుంటూ అటువైపు కొస్తున్నాయి. చుట్టూ పొలాలు, అక్కడక్కడా చెరుకు తోటలు ... మధ్య మధ్యన ఎండిన బీళ్ళు కూడా కనిపిస్తూనే ఉన్నాయి.

ఇద్దరూ నడుచుకుంటూ మట్లోళ్ళపల్లె చేరుకున్నారు.

చాలా ఏళ్ళ తర్వాత భారతం మిట్టలో అడుగు పెట్టాడు రంగప్ప. తాను వయసులో ఉన్నప్పుడు ఎన్నో సంవత్సరాలు ఆ ఊర్లో భారతాలాడాడు. అది గుర్తువచ్చి ఏదో తన్మయత్వానికి గురయ్యాడు. ఒక్కసారి ఆ ప్రదేశాన్ని పరిశీలనగా చూశాడు.

అదొక చింత చెట్ల తోపు. మధ్యలో పెద్ద బీడు. ఆ బీట్లో దక్షిణం వైపున ద్రౌపదమ్మ గుడి, దానికవతల పల్లె. గుడి ముందర విశాలమైన చలువ పందిళ్ళు. వాటికవతల ఆ రోజే అక్కడికి చేర్చబడిన పొడుగాటి అశోక చెట్టు... దాన్ని దాటుకుని ద్రౌపదమ్మ గుడిలోకి వెళ్ళారు. అక్కడ పాండవుల విగ్రహాలతోబాటు కృష్ణ, ద్రౌపది, పోతురాజుల విగ్రహాలు వరుసగా కొలువు దీరి ఉన్నాయి. అక్కడే పసుపు బట్టలు కట్టుకొని ఇద్దరు కన్నెస్వాములున్నారు.

ద్వారకుడు, రంగప్ప విగ్రహాల దగ్గరగా వెళ్ళి మొక్కుకున్నారు. ఒక కన్నెస్వామి వాళ్ళకు హారతిచ్చాడు. మరో కన్నెస్వామి బండారిచ్చాడు. ఇద్దరూ హారతి కళ్ళకద్దుకుని, బండారు బొట్టు పెట్టుకున్నారు. ఆ తర్వాత ఆ గుడి పక్కనే టెంకాయ కీతుల్తో ఏర్పాటు చేసివున్న సపారిలోకి అడుగుపెట్టారు.

అదే ఆటోళ్ళకు ఏర్పాటు చేసిన విడిది.

ఆ సపారంతా ఒక్కసారి కలయచూశాడు రంగప్ప. సపారి పెండేలకు విగ్గులు, సవరాలు, దండలు, కిరీటాలు, భుజకీర్తులు, డాలు గుడ్డలు వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఒక మూలన ఆట ఆడేటప్పుడు ఉపయోగించే గదలు, విల్లులు, బాణాలు, కత్తులు నిలబెట్టబడి ఉన్నాయి. ట్రంకు పెట్టెల్లో వేషాలు, బట్టలు భద్రపరచబడి ఉన్నాయి. కొన్ని ట్రంకు పెట్టెలు మూతలు తెరిచే ఉన్నాయి. రాత్రంతా నాటకం వేసిన కళాకారులు ఆ పెట్టెల పక్కనే పడి నిద్రపోతున్నారు. మరో మూలన ఓ కళాకారుడు జ్వరంతో మూలుగుతున్నాడు.

"రా. రంగప్పన్నా రా. నీ కోసరమే చూస్తూ వుండాము" అప్పుడే కండ్లుతెరచి, పులుముకుంటూ ఆహ్వానించాడు మునివెంకటప్ప.

వేషాలున్న ఒక ట్రంకు పెట్టెకు నడుము అనించి అతని పక్కనే కూర్చున్నాడు రంగప్ప. ద్వారకుడు వెళ్ళి తన వేషాలున్న స్థలంలో కూర్చున్నాడు. అప్పటికే లేచివున్న కొందరు కళాకారులు వాళ్ళను పలుకరించి ఊళ్ళో విశేషాలను అడిగి తెలుసుకున్నారు.

\+ \+ \+ \+

భారతం మిట్ట నడిబొడ్డున పొడవుగా, బ్రహ్మారాక్షసి కళేబరంలా పడి వుంది కొమ్మలు లేని ఒక అశోక వృక్షం. రెండు రోజుల క్రితం పులిచెర్ల బి.వి.రెడ్డి గారి మామిడితోటల్లో నుంచి కొట్టి నాలుగు ఎడ్ల బండ్లపైన వేసుకువచ్చిన అశోక వృక్షమది. దానికి చివర జానెడు వెడల్పు, బారెడు పొడవు చెక్క అడ్డంగా, పీఠంలాగా అమర్చబడి ఉంది.

దానికి మూడు మూర్ల ఎత్తులో, ఆ చెక్క కొసల్ని కలుపుతూ మూరెడు వెడల్పు తో గొడుగులాగా వెదురుదబ్బల్ని వంచి కట్టి, దానికి కాషాయరంగు బట్టను కప్పారు. దానికి మామిడాకులు, పూలు చుట్టారు. భారతం మిట్ట మధ్యలో పెద్ద గొయ్యి తవ్వి దాన్ని నిలువునా పాతారు. ఆ వృక్షానికి గజానికొకటి చొప్పున మెటికలమర్చారు. అదే తపస్సు మాను.

ఇదంతా రంగప్ప అక్కడికి వెళ్ళిన మరునాటి ఉదయాన్నే జరిగింది. ఇంద్రకీలాద్రి పర్వతానికి ప్రతీకగా భావించబడే ఆ తపస్సుమాను, భూమాత ఆకాశానికి సంధించిన పెద్ద బాణంలా కనిపిస్తోంది.

ఆ రోజు ఉదయం పదకొండు గంటలకే ముహూర్తం. పది గంటలకే ఆ పల్లెలోనే గాక, చుట్టు ప్రక్కల వున్న గ్రామాల నుంచీ కూడా తండోపతండాలుగా జనం రాసాగారు. భారతం బైలంతా జనంతో క్రిక్కిరిసి పోసాగింది. అర్జునుడు తపస్సు మానెక్కే దృశ్యాన్ని చూడడానికి కాచుకొని ఉన్నారు. ప్రజలు తపస్సు మాను దగ్గరకు రాకుండా దానికి వలయాకారంగా తాడుతో కంచె ఏర్పాటు చేశారు.

మరో అరగంటకంతా పాండవుల మేషధారులు, కృష్ణ వేషధారి అక్కడికి చేరుకున్నారు. తాడు లోపలున్న ఖాళీ స్థలంలో ఒక బెంచీ వేసున్నారు. ఆ బెంచీపైన తబలాలు, హార్మోనియంను ఉంచారు. మరో పక్కన పోతరాజు విగ్రహం, కృష్ణ ద్రౌపదుల విగ్రహాలు పెట్టారు. ఒక ప్రక్కన పంబల వాడు పూనకం పూనినట్లు ఊగిపోతూ పంబల కొడుతున్నాడు. పాండవులతో బాటుగా చెంచు, చెంచిత వేషధారులు కూడా అక్కడికి చేరుకున్నారు. వారు అర్జునుడిని పరీక్షించడానికి వచ్చే పార్వతీ పరమేశ్వరుల మారువేషాలు. పాసుపతాస్త్రం కోసం తపస్సుకు బయలు దేరే వేషం రంగప్ప వేసుకున్నాడు.

మెడలో రుద్రాక్షమాలలు, తలకు మొలకు కాషాయపు రంగు బట్టలు చుట్టుకున్నాడు. అదే రంగు గుడ్డను మోకాళ్ళ కింది వరకు విడిచి గోచీ కట్టాడు. భుజాలకి, వంటికి విబూధి రేఖలు పూసుకున్నాడు.

వేషమైతే వేశాడు గానీ అతని మనసు మనసులో లేదు. రోజూ ఇంటికి వచ్చి అప్పు తీర్చమని వేధించే అప్పుల వాళ్ళు గుర్తుకు వచ్చారు. వారం క్రితం జరిగిన 'జప్తు' గుర్తుకొచ్చింది. తమని పోషించడానికి కష్టాలుపడుతున్న కూతురు గుర్తుకొచ్చింది.

"ఇన్ని కష్టాలని మనిషి యెట్లా ఓర్చుకునేది. ఓర్చి బతికేదానికవునా. అయినా నేను ఇంకా బతికే ఉండాను గదా."

ఆలోచించేకొద్దీ రంగప్పకు తానుకనిపించని ఏదో ఊబిలో పీకల్దాకా కూరుకుపోయినట్లు అనిపించింది. ఎవరో పన్నిన పద్మవ్యూహంలో చిక్కుకు పోయినట్టు కూడా అనిపించింది. ఆ దిగులుతోనే అక్కడ చేరిన జనాల ముఖాలను చూశాడు.

అందరి ముఖాల్లోను ఏదో చెప్పరాని బాధ దోబూచులాడుతున్నట్టే ఉంది. ప్రతి మనిషి వెనుక అప్పులవాళ్ళ గుంపు పరుగెత్తుతున్నట్టే ఉంది. ఎందరో పెండ్లిండ్లు కాని ఆడపిల్లలు, ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల ఆత్మలు, ఎండి పోతున్న చెరకు తోటలు, ఎడారిలాగా మారిపోతున్న భూములు, బీటలు బారిన చెరువులు, నీళ్ళు లేక పూడిపోతున్న బావులు, పసుపుదారాలతో దీనంగా కనిపించే పేదల ఇల్లాండ్రు. బక్కచిక్కిన పిల్లల ఆకారాలు, ఇంకా ఎన్నో దృశ్యాలు అందరి ముఖాల్లోను కనిపించీ కనిపించకుండా పతనమై పోతున్నట్టే ఉంది.

పంబల వాడు పంబల కొట్టడం ఆపాడు, కార్యకర్తలు కొబ్బరి కాయలు కొట్టారు. హారతి వెలిగించారు. తబలిస్టు మద్దెల కొట్టడం ప్రారంభించాడు. హార్మోనిస్టు హార్మోనియం పలికించాడు. గురువు మునివెంకటప్ప వినాయకస్తుతి చేసి దరువెత్తుకున్నాడు. సంతు కోరి వచ్చిన స్త్రీలు సచేల స్నానం చేసి వచ్చి ఆ తపస్సు మాను చుట్టూ వరపడ్డారు.

అరటి పండ్లు, నిమ్మకాయలు, మిఠాయిలు, బొరుగులు, విబూది పండ్లు, కొబ్బరి కాయ ఉన్న జోలెను మునివెంకటప్ప రంగప్ప సంకకు తగిలించాడు.

"తవుసుమాను ఎక్కిన తర్వాత టెంకాయ కొట్టి, వప్పులు చేసి, అన్నీ కలగలిపి వాటిని భక్తులపైకి చల్లాల. అవి దొరికిన వాళ్ళ కోరికలు నెరవేరతాయంటారు గదా. వాటి కోసరమే శ్యానా మంది జనం కాసుకోనుంటారు. కిందికి దిగినాంకా పండో ఫలమో వరపడిన ఆడోళ్ళకియ్యాల. నువ్విచ్చే దాన్ని బట్టే వాళ్ళకు సంతు కలుగుతుంది... ఇవి నీకూ తెలిసినవే. చెప్పాల్సిన ధర్మం వుండాది గాబట్టి సెప్తావుండా" అంటూ భుజం తట్టి చెప్పాడు.

"పరాబ్రహ్మ... పరాబ్రహ్మ.... పరమేశ్వర...." చేతులు జోడించి దరువెత్తుకున్నాడు రంగప్ప. కానీ గొంతు పెగలటం లేదు. బలవంతాన నరాల బిగువుతో పాడుతున్నాడు. శక్తి నంతా కూడదీసుకుని, మరీ పాడుతున్నాడు.

వయసులో ఉన్నప్పుడు ఎంతో గొప్పగా పాడే రంగప్ప గొంతులో అప్పటి మాధుర్యం లేదు. ఆతను పాట పాడుతుంటే గొంతుపైన ముడతలు పడ్డ చర్మంలో నుంచీ నరాలు పైకి ఉబికి వస్తున్నాయి.

ఆయాసపడిపోతూనే దరువు మీద దరువు, పద్యం మీద పద్యం పాడుతూనే ఉన్నాడు.

మునివెంకటప్ప నిమ్మకాయలు కోసి కుంకుమ కూరి కట్టు మంత్రం చదివి, నిమ్మకాయ దబ్బల్ని నాలుగు వైపులకీ విసిరాడు.

"ఇంక ఏ చెరుపు చేసినా మనకు తగలదు. నువ్వు కానీ రంగప్పన్న" అన్నాడు మునివెంకటప్ప.

"ఈ కాలంలోనూ చెరుపు చేసే వాళ్ళు యాడుంటారుగానీ...' అన్నాడు రంగప్ప.

"అట్టనొద్దన్నా... ఈడికి నానాజనం వస్తా ఉంటారు. నానాజనం పోతా వుంటారు. వాళ్ళల్లో ఎవరు ఎట్లాంటోళ్ళో మనకు తెలీదు. ఏ పుట్టలో ఏ పాముంటుందో. మన జాగ్రత్తలో మనముండాలగదా. ఏదయినా ఆపితి జరిగింతర్వాత అయ్యో మంటే వస్తుందా. కుయ్యో మంటే వస్తుందా?" అన్నాడు మునివెంకటప్ప.

"నాకేమీ కాదులే మునెంగటా. అన్నీ తెగించినోన్ని" అన్నాడు రంగప్ప.

"అతని ముఖం చూస్తుంటే కడదాకా ఇతను ఎక్కగలడా, ఎక్కినా సురక్షితంగా తిరిగి దిగగలడా. దిగి మళ్ళా చెంచుతో యుద్ధం చేసే కత పాడాల. పాడగలడా. స్వామి కృష్ణా ! పోతరాజా స్వామి తల్లీ ద్రౌపదమ్మా! ఈ కార్యం సజావుగా సాగిపోయేట్టుగా సూడండీ" అంటూ మనసులోనే దేవుళ్ళకు మెక్కుకున్నాడు మునివెంకటప్ప.

రంగప్ప తపస్సుమాను చుట్టూ మూడుసార్లు తిరిగాడు. దాని మొదలును కళ్ళకద్దుకున్నాడు. ఆ తర్వాత తలెత్తి మాను చివరి వరకూ చూశాడు. మెడ పట్టేసినట్టనిపించింది.

మానుకొస ఎక్కడో ఆకాశంలో గాలికి ఊగిపోతూ కనిపిస్తోంది. దానికి చుట్టి వున్న పూలూ, మామిడాకులు రెపరెపలాడుతూ గాలిలో ఎగురుతూ కనిపిస్తున్నాయి.

"ఈ వయసులో ఇంత పెద్ద మాను ఎక్కగలనా?" ఒక్కసారి అతని మనసు అనుమానం వ్యక్తం చేసింది.

"ఫరవాలేదులే. భయపడొద్దు. మేముండాం గానీ" తోటి కళాకారులు ధైర్యం చెప్పారు. రంగప్ప తపసు మానెక్కడం ప్రారంభించాడు. మెటిక మెటికకూ ఒక పద్యం, ఒక దరువు పాడుకుంటూ ఎక్కసాగాడు. అతని వెనక ద్వారకుడు అతని దరువుకనుగుణంగా తాళాలు వేస్తూ ఎక్కుతున్నాడు. అతని వెనక మునివెంకటప్పా.... సంగం వరకు ఎక్కి ధైర్యం చెప్పి ఆగిపోయాడు. ద్వారకుడూ అక్కడే కూర్చున్నాడు.

పైపైకి ఎక్కేకొద్దీ రంగప్ప శరీరంలోని సత్తువ కొంచెం కొంచెం తగ్గిపోసాగింది. కాళ్ళు వణుకుతున్నాయి. కళ్ళు తిరుగుతున్నాయి. అయినా ఎలాగో సంభాళించుకుంటూనే పళ్ళ బిగువున పైకెక్కుతున్నాడు. గుండెలో బాధా ఎక్కువ కాసాగింది. ఎలాగయితేనేం.... ఒక్కొక్క మెట్టునే జయించుకుంటూ మాను చివరివరకూ వెళ్ళాడు. చివర ఉన్న చెక్క పీఠాన్ని పట్టుకున్నాడు.

చేతులు వణికాయి.... కాళ్ళను మానుకు పెనవేసుకుని జోలె తీసి చెక్కపీఠంపైకి తోశాడు. కాళ్ళ చర్మం మంట పెట్టసాగింది. అతి జాగ్రత్తగా వెళ్ళి ఆపీఠంపైన కూర్చున్నాడు. చెక్కకు అటువైపు ఒక కాలు, ఇటువైపు ఒక కాలు వేసి కూర్చున్నాడు. అతనలా కూర్చుంటున్నప్పుడు చెక్క కిటకిటలాడింది. కిర్రున శబ్దం చేసింది. రంగప్ప వెన్నులో వణుకు పుట్టింది.

"అర్జునా ఫల్గుణా పార్థా కిరీటి కృష్ణా..." అంటూ క్రింద జనం కౌంతేయుని దశనామాలు జపిస్తున్నారు. నేలపైనున్న కళాకారులు జాగ్రత్తలు చెబుతున్నారు. కానీ అవేవీ అతనికి వినిపించడంలేదు...

రంగప్ప పై నుంచీ ఒక్కసారి కిందకి చూశాడు. ఎక్కడో ఆకాశంలో నుంచీ చూసినట్టుగా అనిపించి క్షణం సేపు కళ్ళు గిర్రున తిరిగాయి. రెండు చేతులతో చెక్కను గట్టిగా పట్టుకున్నాడు.

భారతం బైలు నిండా క్రిక్కిరిసిన జనాలు.... మనుషుల్నే కాయలుగా కాసినట్టు చింత చెట్లు మనుషులతో ఊగి పోతున్నాయి. మాను మొదలు చుట్టూ వరపడిన స్త్రీలు కాగితంపైన గీసిన బొమ్మల్లా కనిపిస్తున్నారు. మనుష్యుల్ని చీల్చుకుని ఆకాశానికి పెరిగిన వెయ్యి కాళ్ళ వింతయిన రాక్షసజర్రిలా తపస్సుమాను...

భారతం మిట్టను దాటి చూపుల్ని దూరంగా సారించాడు.

ఎండి పోయిన పొలాలు, బీడు నేలలు వాటి మధ్యన అక్కడక్కడా అస్పష్టంగా కనిపిస్తున్న జనావాసాలు, ఒకటీ అరా పశువులు.... కళ్ళకు స్పష్టంగానే కనిపించసాగాయి.

"ఇక్కడా రైతుల పరిస్థితి బాగా లేనట్టుండాది. ఎంత దూరం జూసినా బీళ్ళే కనిపిస్తాఉండాయి. ఎక్కడగానీ నీళ్ళ సుక్కే కనిపించలా..." అనుకున్నాడు.

పంటలు పైర్లు గుర్తుకొచ్చేసరికి అతనికి తన ఊరు గుర్తుకొచ్చింది. తన ఇల్లు గుర్తుకొచ్చింది. తన ఇంట్లో తాండవించే దరిద్రం గుర్తుకొచ్చింది. మారు చీరకు నోచుకోక, ఎప్పుడూ ఇంటిపెరట్లో సుంకేసర చెట్టు కింద దిగాలుగా కూర్చొనే ఇల్లాలు వెంకటమ్మ ఆకారం బొమ్మ కట్టింది. పెండ్లీడు మీరిపోతున్నా పొట్టకూటి కోసం అగచాట్లు పడుతున్న కన్న కూతురు కళ్ళలో మెదిలింది. ఈదలేని ఇంటి సంసారం, పండని పొలాలు, మిగిలి పోయిన అప్పులు, అవి తెచ్చి పెట్టిన అవమానాలు, బాధలు అన్నీ మనసులో కదిలాయి...

అనుకోకుండానే అతని కళ్ళు చెమ్మగిల్లి రెండు కన్నీటి బొట్లు రాలి జోలెపైన పడి ఆ గుడ్డలో ఇంకి పోయాయి...

ఇంతలో 'ఉత్తీత.... ఉత్తీత' అంటూ ఒక తీతువు అరుచుకుంటూ పక్కన వరుసుకుంటూ పోయింది. దాంతో ఇహంలోకొచ్చాడు రంగప్ప.

"ముండగువ్వా... నువ్వు అరిస్తే ఏదో వొగ చేటు జరుగుతుందంటారు. అయినా కడతేరని ఈ కరువు కంటే ఇంక ఏం చేటుకాలం దాపరిస్తాదిలే... అర్సుకో.." అని దాన్ని ఒక తిట్టు తిట్టి తను చేయాల్సిన పనిని గుర్తుకు తెచ్చుకున్నాడు...

మెల్లగా జోలెవిప్పి కొబ్బరి కాయ బయటకు తీశాడు. దాన్ని కళ్ళకద్దుకొని చెక్కపైన కొట్టి రెండొప్పలు చేశాడు.... అందులోని నీళ్ళు జలజలా రాలి కిందికి దొర్లాయి. జోలెలో నించి కత్తి తీసి, దాంతో కొబ్బరిని వలిచి ముక్కలు చేసి జోలెలో కలిపి, పిడికిళ్ళతో నాలుగు వైపులకీ ఆ బొరుగుల మిశ్రమాన్ని విసరసాగాడు. బొరుగులు గాలిలో తేలి పోతున్నాయి.

భక్తులు వాటి కోసం చేతులు చాచారు. కొందరు తలగుడ్డలు పట్టారు. ఆడవాళ్ళు పైటలు చాచారు.... పండో, విబూధో దొరికితే సంతోషపడసాగారు. "అర్జునా పార్థా కిరీటి...." అంటూ అరుస్తున్నారు.

జోలెను ముప్పాతిక భాగం ఖాళీ చేసింతర్వాత, వేలాడుతున్న పూలను కొన్ని తెంచి జోలెలో వేసుకుని మూటగట్టాడు. కొబ్బరి చిప్పల్ని, చాకును కూడా అందులోనే వేశాడు. దాన్ని సంకకు తగిలించుకుని దిగడానికి ప్రయత్నించాడు.

ఎక్కేటప్పుడైతే ఎక్కేశాడు గానీ దిగాలంటే చాలా భయం వేసంది. ఎలాగో గుండెను దిటవు చేసుకొని చెక్కను పట్టుకొని కాళ్ళు కిందకి చాచాడు....

చెక్క కిర్రుమని మరోసారి శబ్దం చేసింది. రంగప్ప గుండెదడ ఎక్కువైంది.

కింద కళాకారులు భద్రం చెబుతున్నారు. గురువు పార్థుడి దశనామాలు జపిస్తున్నాడు... ద్వారకుడు అక్కడున్న విగ్రహాలకు మొక్కుకుని "పెద్దాయన్ను రక్షించండి, కాపాడండి" అంటూ వేడుకుంటున్నాడు.

రంగప్ప వణుకుతున్న చేతులతో మెల్లగా శరీరాన్ని దించి మెటికలపైన కూర్చున్నాడు. శరీరం అదరసాగింది. కాళ్ళు నిస్సత్తువగా వణకసాగాయి.

"ఎట్టరా పరమాత్మా దిగేది" అని ఒక్కసారి అనుకుని మెల్లగా ఒక్కొక్క మెటికనీ దిగుతూ కిందికి కదిలాడు...

దిగేకొద్దీ శరీరంలో నిస్త్రాణ పెరగసాగింది. కళ్ళు మసకలు కమ్మసాగాయి.

ఎలాగయితేనేం. చివరి మెటిక దిగబోయి కిందికి పడబోయాడు. అంతే అక్కడున్న ద్వారకుడు, మునివెంకటప్ప చెరోపక్క పట్టుకొని దించారు. దిగిన రంగప్ప అలాగే చెట్టు మొదలుకు అనుకున్నాడు. ఆయాసంతో ఎగశ్వాస వచ్చింది.

ద్వారకుడు శిలల దగ్గరకు పరిగెత్తాడు. అక్కడ కొత్త మూకటిలో ఉన్న బండారు తెచ్చి అతని ముఖాన పెట్టాడు. మరో కళాకారుడు చెంబుతో నీళ్ళిచ్చాడు.

జనం చూస్తూనే ఉన్నారు. గురువు జోలెను తీసి ముడివిప్పి అందులో నుంచీ పూలను తీసి మిగిలిన మిశ్రమంలో కలిపి వరపడిన వారి చేతుల్లో పెట్టసాగాడు.

తమ చేతుల్లోకి చేరిన ఫలమో, పుష్పమో చూసుకుని లేచి రంగప్ప కాళ్ళకు మొక్కుకొని, ఒకరొకరే శిలలకు నమస్కరించి, అంత బండారు నొసటలకు దిద్దుకొని సంతోషంగా అక్కడి నుంచి వెళ్ళి ప్రేక్షకుల్లో కలిసిపోయారు వరపడిన స్త్రీలు.

"మన కార్యం నెరవేర్చినావన్నా సంతోషం!" అభినందనగా అన్నాడు గురువు.

"మామా.... జయించినావు" మెచ్చుకోలుగా అన్నాడు ద్వారకుడు.

నీళ్ళు తాగి తెపరాయించుకున్న రంగప్ప తలపైకెత్తి అందరివైపు చూశాడు. అందరి ముఖాల్లోను విజయోత్సాహం...

ప్రేక్షకులు జయజయధ్వానాలు చేస్తూఅర్జునుడి పేర్లు జపిస్తున్నారు. ఆ తర్వాత జరగతోయే శివార్జునుల మల్లయుద్ధ ఘట్టం దర్శించడానికి తోసుకుంటూ ముందుకు వస్తున్నారు. భారతం మిట్టంతా వెల్లువెత్తిన కోలాహలం... ఆనందం. రంగప్ప గుండెల్లో మాత్రం ఏదో నిర్వేదం!

"నేనిపుడు జయించినట్టా.... ఓడిపోయినట్టా... అసలు ఎందులో జయించినట్టు, ఎందులో ఓడిపోయినట్టు.... ఏది జయం? ఏది ఓటమి?" అతని ఆలోచనలు కందిరీగలయ్యాయి. మనసుకు ముసురుకున్నాయి. పైకి లేవనీయడం లేదు. అయోమయంగా తలవంచుకుని ఉండిపోయాడు.

అతను అనుకుని ఉన్న తపస్సు మాను మాత్రం ఇంకా గర్వంగా నిటారుగా అలాగే నిలబడి ఉంది.

● ఆదివారం ఆంధ్రజ్యోతి - 16 మే, 2004 ●